క్లుప్తంగా

వంట మనిషి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

మోమిన్‌పేట: మండల పరిధి చంద్రాయన్‌పల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో ప్రధాన వంట మనిషి (మహిళ) కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత 10వ తరగతి ఉత్తీర్ణత ఉండి, 18 సంవత్సరాల నుంచి 45సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఈ నెల 13వ తేది సాయంత్రం 5గంటల లోపు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



సునీతారెడ్డిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

యాలాల: జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిని శనివారం కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. పట్నం కుటుంబం కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సునీతారెడ్డిని కలిసిన వారిలో తిమ్మాయిపల్లి మాజీ ఎంపీటీసీ రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, నాయకులు గంతల మోయిజ్, అహ్మద్, చిన్న, మారుతి, మంగలి అశోక్, శేఖర్, మైనొద్దీన్, హన్మంతు, లాలు, నవీన్ తదితరులు ఉన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత పెంపు



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ సభ్యులు

పరిగి: నిత్యం ధ్యానం చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఏకాగ్రత పెరుగుతుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి లావణ్య అన్నారు. శనివారం మండల పరిధి పోల్కంపల్లి, నర్సయ్యగూడ గ్రామాల్లో ధ్యానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్వాస మీద ధ్యాస అనే ధ్యానం ద్వారా తలనొప్పి, క్యాన్సర్ లాంటి వ్యాధులు నయం అవుతాయని పేర్కొన్నారు. ధ్యానంతో మనలో ఒత్తిడి దూరమయి, ఆత్మశక్తి పెరుగుతుందని, తద్వారా నిత్యనూతనోత్సాహంతో ఉంటామని వెల్లడించారు. కావున ప్రతి ఒక్కరూ రోజు ఉదయం ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు అంజిరెడ్డి, బాబు, వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ నూతన కమిటీ నియామకం

కొడంగల్ రూరల్: విశ్వకర్మలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని, హక్కుల సాధనకు సంఘటితం కావాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ విశ్వకర్మ కమిటీ రాష్ట్ర ఇన్‌చార్జి మాదారం శ్రీనివాస్‌చారీ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో నిర్వహించిన విశ్వకర్మల తాలూకా స్థాయి సమావేశంలో తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్ల బ్రహ్మయ్య చారీ, ఇన్‌చార్జిగా వడ్ల రాఘవేంద్రచారీ, గౌరవ అధ్యక్షుడిగా వడ్ల వెంకటరాములు చారీ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్ల రవీంద్రచారీ, యూత్ ప్రెసిడెంట్‌గా రాజేష్‌చారీలను నియమించారు. నూతన కమిటీ సభ్యులు విశ్వకర్మల అభ్యున్నతికి కృషి చేయాలని కమిటీ పెద్దలు సూచించారు. ఇందులో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల అధ్యక్షులు దశరథ్‌చారీ, వెంకట్‌రాములు, వెంకటేశ్ చారీ, కలప్పాచారీ తదితరులు పాల్గొన్నారు.

పట్నం కుటుంబంతోనే..

బంట్వారం: బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి దంపతుల వెంటే.. తన రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని తెలిపారు. పట్నం దంపతులు త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నరేందర్‌రెడ్డి కూడా వారి వెంటే ఉంటానని స్పష్టం చేశారు.

మార్కెట్‌కు 1,500 బస్తాల వేరుశనగ

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 1,500 బస్తాల వేరుశనగ దిగుబడి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7 వేలు, కనిష్ఠంగా రూ.6,500 ధర ఉందని, ఈ మేరకు కొనుగోళ్లు జరిగాయని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. అదే విధంగా కందులు 453 బస్తాలు వచ్చాయని, క్వింటా ధర రూ.10,300 నుంచి రూ.10,450 వరకు ఉన్నట్లు ఆమె వెల్లడించారు.

సంత మా ఊరి సంత

- పల్లె జనంతో సందడేసందడి
- తక్కువ ధరకు తాజా కూరగాయలు
- ఇరు రాష్ట్ర ప్రజల అంగడిగా గుర్తింపు

బషీరాబాద్: బషీరాబాద్ సంత.. జిల్లాలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు బషీరాబాద్ గ్రామంలో ప్రతి ప్రతి మంగళవారం అంగడి కొనసాగుతుండటంతో ఉభయ రాష్ట్రాల ప్రజల సందడితో సంత కళకళలాడుతుంటుంది. ఇక్కడికి ఇరు ప్రాంతాల పరిధి నుంచి సుమారు 8 వేల వరకు జనం వస్తున్నట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు. ''సంత మా ఊరి సంత, వారానికోసారి జోరుగా సాగే సంత మా ఊరి సంత'' అంటూ ప్రముఖ కవి గోరటి వెంకన్న పాడిన పాట పల్లె జనం గుండెల్లో ఎలా పాతుకుపోయిందో.. పాటకు సరిపోయేలా.. సంత ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిందని స్థానికులు తెలిపారు.



క్రయవిక్రయ దారులతో కిక్కిరిసిన సంత

తాజా కూరగాయాలు..

బషీరాబాద్ మండల పరిధి గ్రామాల్లోనే కాకుండా.. తాండూరు, కర్ణాటకలోని రాజోళ్లి తదితర ప్రాంతాల్లో అత్యధిక రైతులు కూరగాయలు సాగు చేస్తుంటారు. వారందరూ వారానికి ఒకసారి జరిగే ఈ సంతలో తాజా కాయగూరలను తక్కువ ధరకే విక్రయిస్తుంటారు. దీంతో ప్రజలు రైతుల వద్ద కొనుగోలు చేయడానికి ఎక్కువగా మక్కువ చూపుతుంటారు.

మిరపకాయ బజ్జీలకు ఫేమస్

ఈ సంత.. మిరపకాయ బజ్జీలతో పెట్టింది పేరు. ఇక్కడి హోటళ్లలో బజ్జీలు చేసి విక్రయిస్తుంటారు. మార్కెట్‌కు వచ్చిన వారిలో నూటికి తొంభై మంది ఈ మిరపకాయ బజ్జీల రుచి చూడందే ఇంటికి వెళ్లరని నిర్వాహకులు పేర్కొన్నారు. సంత రోజున 10 క్వింటాళ్ల శనగ పిండిని కేవలం బజ్జీలకు వినియోగిస్తారంటే.. బజ్జీల క్రేజీని అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా.. ఈ అంగడి ఒక షాపింగ్ మాల్ అని, ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదని కొనుగోలు దారులు తెలిపారు. గుండు సూది మొదలు ఏదైనా లభించనుందని చెప్పారు. బషీరాబాద్ ప్రాంతం పూర్తి గ్రామీణ ప్రాంతం కావడంతో.. సంతకు ఇరు రాష్ట్రాల పరిధి గ్రామాల నుంచి అనేక మంది వస్తుంటారు. దీంతో ఇక్కడ పల్లెకళ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇలా వారానికి ఒకసారి వచ్చేవారంతా.. సంతకు వన్నె తెచ్చిన మిరపకాయ బజ్జీలను తింటూ పల్లె సుద్దులను వల్లిస్తుంటారు. బజ్జీలతో పాటు మటన్ సీకులు, బోటి కూర తినడానికి మక్కువ చూపడం గమనార్హం.



హోటల్లో బజ్జీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పప్పు దినుసుల్లో ప్రొటీన్లు ఎక్కువ

మనిషికి, మట్టికి మంచి పోషణ

- ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

ధారూరు: పప్పు దినుసులు మనుషులకు, మట్టికి మంచి పోషణ అని రాజేంద్రనగర్ భారతీయ నూనె గింజల సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మాథూర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ రమణ రావులు అన్నారు. మండల పరిధి గురుదోట్ల గ్రామంలో శనివారం ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పప్పు ధాన్యాలు మాంసాహారం కన్నా ఎక్కువ ప్రొటిన్లు ఇస్తాయని, పప్పును ఆహారంలో తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పప్పు దినుసుల సాగులో విత్తన శుద్ధి తప్పనిసరని, లేదంటే ఎండు తెగులు వ్యాపించి పంట ఎండిపోవడానికి కారణమవుతుందని పేర్కొన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి..

కందుల సాగులో మెళకువలు పాటించాల్సి ఉంటుందని, పంట చేతికి వచ్చాక.. పప్పుగా మార్చి విక్రయిస్తే అదనపు ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. ప్రతిసారి పంట మార్పిడి చేయాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పప్పు దినుసుల వలన కలిగే ప్రయోజనాలు, నవ ధాన్యాల సాగు, పంట దిగుబడి, పంటకు సోకే చీడపీడలు, వాటి నివారణకు పలు సూచనలు చేశారు. అనంతరం రెండు సంవత్సరాల నుంచి కంది పంటను సాగుచేస్తున్న 10 మంది మహిళా రైతులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మమ్మ, శాంతలక్ష్మి, లావణ్య, దివ్య, సురేష్, ఏపీ అన్‌గ్రావ్ మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాసు, వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌కే మాథూర్

సమ్మెను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యాలాల: కేంద్ర ప్రభుత్వ మతతత్వ కార్పొరేటు విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న చేపట్టబోయే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓకు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలతో చాలా మంది నష్టపోతున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు దాటినా.. కార్మిక, రైతాంగ సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సంఘం నాయకులు హనీఫ్, షబ్బీర్, మొగులప్ప, శ్రీనివాస్, లక్ష్మి, అనంతమ్మ, సరస్వతి, శ్యామమ్మ, రాములు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

- అర్హులందరూ వినియోగించుకునేలా ప్రోత్సహించాలి
- ఆర్డీఓ విజయకుమారి

పరిగి: అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా.. అవగాహన కల్పించాలని ఆర్డీఓ విజయకుమారి సూచించారు. శనివారం తహసీల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటరు తుది జాబితా ఈ నెల 8న వెలువడిందని, జాబితాను పరిశీలించాలన్నారు. ఓటు హక్కుపై.. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

చేపట్టి, వజ్రాయుధం లాంటి ఓటును వినియోగించుకుని, మంచి నాయకున్ని ఎన్నుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్ ఆనంద్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారం మరువలేనిది



తాండూరు రూరల్: మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: గ్రామ అభివృద్ధికి ప్రజల సహకరం మరువలేనిదని మాజీ సర్పంచ్ బుడ్డెల్లి సాయిలు అన్నారు. శనివారం మండల పరిధి కోత్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మాజీ పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడారు. తనపై నమ్మకంతో రెండుసార్లు సర్పంచ్‌గా గెలిపించిన గ్రామస్తులకు రుణపడి ఉంటానన్నారు.



ధారూరులో..

ధారూరులో..

ధారూరు: మండల పరిధి హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులకు హెచ్‌డీపీ సంఘం కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ పాలకవర్గ సభ్యులు పి.లక్ష్మమ్మ, అనిత, యాదయ్య, సురేష్‌గౌడ్‌ను హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

దుమ్ముతో ఉక్కిరిబిక్కిరవుతున్నాం..



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

యాలాల: 'అసంపూర్తి రోడ్డు పనులతో ఇబ్బంది పడుతున్నాం. వాహనాల రాకపోకలతో గాలిలో లేస్తున్న దుమ్ముధూళితో వెనకాల వస్తున్న వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలి' అని అగ్గనూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం తాండూరు–బషీరాబాద్ రహదారిలో గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అగ్గనూరు నుంచి బషీరాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టరు మధ్యలోనే వదిలేశాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయమై గత నెల 29న ధర్నా చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అరగంట పాటు నిరసన కొనసాగడంతో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శంకర్.. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని నిరసనకారులకు నచ్చజెప్పారు. ఫోన్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో రోడ్డు సమస్య గురించి వివరించారు. అధికారులు త్వరలో పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

నిష్పక్షపాతంగా అర్హుల ఎంపిక

- దరఖాస్తుల ఆధారంగా కొనసాగుతున్న సర్వే
- అధికారుల వెల్లడి

యాలాల: ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గ్యారంటీ పథకాల్లో ఒకటైన రూ.500లకే వంట గ్యాస్‌కు అర్హుల ఎంపికను నిష్పక్షపాతంగా చేపడుతున్నట్లు మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) గాలి యాదయ్య తెలిపారు. శనివారం మండల పరిధి బెన్నూరు, అగ్గనూరు తదితర గ్రామాల్లో చేపట్టిన గ్యాస్ అర్హుల వివరాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో వచ్చిన అర్జీల ఆధారంగా నిజమైన అర్హుల జాబితాను తయారు చేస్తున్నామని, ప్రక్రియ అనంతరం అర్హులందరికీ.. ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు తారకచారీ, రమాదేవి తదితరులు ఉన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: నిజమైన అర్హుల గుర్తింపు అనంతరం.. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో లబ్ధిదారులందరికీ రూ.500లకే వంట గ్యాసు అందనుందని తహసీల్దార్ బి.విజయకుమార్ తెలిపారు. శనివారం మండల పరిధి టేకుల్‌కోడ్, రుద్రారం గ్రామాల్లో సిబ్బంది చేస్తున్న గ్యాస్ సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్‌కు.. అర్హులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాపాలనలో గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాలో ఉన్న వారి గ్యాస్ కనెక్షన్ నంబర్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్, గ్రామస్తులు వన్నె బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



యాలాల: గ్యాస్ అర్హుల వివరాలను సేకరిస్తున్న ఎంపీఓ తదితరులు



కొడంగల్ రూరల్: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

అర్హులందరికీ.. గ్యారంటీలు

దోమ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. శనివారం మండల పరిధి మోత్కూర్ గ్రామంలో విద్యుత్ సిబ్బందితో కలిసి 200 యూనిట్లకు సంబంధించి దరఖాస్తులను గ్రామస్తుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తుందని, ఇతర పథకాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి



ఉచిత విద్యుత్ దరఖాస్తులను స్వీకరిస్తున్న రాజేశ్వరమ్మ

రాములు, విద్యుత్ సిబ్బంది, కాంగ్రెస్ నేతలు ఆనంద్, లింగయ్య, కండక్టర్ మల్లయ్య, జమీల్, చెన్నయ్య, గోపాల్, రాఘవేందర్, చంద్రకాంత్, ఖైర్, రవి, ఖయ్యూమ్, కృష్ణ, సుధాకర్, మల్లేశ్, సారంగి, వెంకటయ్య, రాములు, రమేశ్, చెన్నయ్య, లక్ష్మణ్, నరేశ్ పాల్గొన్నారు.

16న రథ సప్తమి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16న రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు మలయప్ప స్వామివారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనం ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

దోమ: కస్తూర్బాగాంధీ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తపస్ తాలూకా ఇన్‌చార్జి రమేశ్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటినా.. నేటికీ జీతాలు రాలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయకుండా.. వారి జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా మల్లేశ్ యాదవ్

మర్పల్లి: బీజేపీ జిల్లా కార్యదర్శిగా బన్నే మల్లేశ్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేశ్ మాట్లాడారు. తన సేవలను గుర్తించిన అధిష్టానం.. జిల్లా కార్యదర్శిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వసతిగృహ సమస్యలను పరిష్కరిస్తా

- సొంత నిధులతో విద్యుత్, తాగునీటి సమస్య తీరుస్తా
- మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాల వసతిగృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, స్పీకర్ ప్రసాద్‌కుమార్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శనివారం ఎస్ఏపీ కళాశాల ఆవరణలోని పీజీ బ్లాక్‌లో కొనసాగుతున్న మెడికల్ కళాశాల బాలికల తాత్కాలిక వసతిగృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యుత్, మరుగుదొడ్లు, యూజీడీ, తాగునీరు తదితర సమస్యలను విద్యార్థినులు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన చైర్‌పర్సన్.. సొంత డబ్బులతో కరెంట్ వైరింగ్, లైట్లు, స్విచ్ బోర్డులు, నల్లాలు, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

విద్యుత్ సరఫరాలోని తీవ్ర అంతరాయం నెలకొంటుందని విద్యార్థులు ఆమె దృష్టికి తేగా.. ట్రాన్స్‌కో అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి, సమస్యలను పరిష్కరించాలని ఆమె సూచించారు. యూజీడీ సమస్యను మున్సిపల్ సిబ్బందితో వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉన్నా.. తెలపాలంటూ విద్యార్థినులకు చైర్‌పర్సన్ తన ఫోన్ నంబరు ఇచ్చారు.

రైతులకు న్యాయం చేయాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: ప్రభుత్వం కొడంగల్‌కు కేటాయించిన మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం రైతుల భూములను తీసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, భూములు కోల్పోతే వారి జీవనం కష్టంగా మారుతుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శనివారం అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 19లో ఉన్న 75 ఎకరాల అసైన్డ్ భూములను వారు పరిశీలించి మాట్లాడారు. ఈ భూములను సాగు చేసుకొమ్మని గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భూముల్లో 47 మంది రైతులు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఉన్నట్టుండి ఆ సాగు నేలలను అభివృద్ధి పనుల పేరిట తీసుకుంటే, వారి బతుకులు ఆగమైతాయని వెల్లడించారు. ప్రభుత్వం పునరాలోచించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ప్రజా సంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, కె.చంద్రయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.